క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లె గ్రామంలో గురువారం రామాలయంలో ఆలయ అర్చకుడు కాశీభట్ల గోపినాథశర్మ నేతృత్వంలో సీతారాముల కల్యాణం కమనీయంగా జరిగింది. అంతకుముందు ఆలయంలో నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన, యజ్ఞాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

జమ్మలమడుగు: క్షయ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని డాక్టర్ చరితారెడ్డి పేర్కొన్నారు. గురువారం చిలంకూరు ఐసీఎల్ (అల్ట్రాటెక్) సిమెంట్ ఫ్యాక్టరీలో టీబీ వ్యాధి గురించి కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల్లో క్షయ నివారణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోషకాహార లోపం, వ్యాధి నివారణ శక్తి లోపం కారణంగా టీబీ వ్యాధి వ్యాప్తి జరుగుతుందన్నారు. క్షయ వ్యాధి లక్షణాలైన దగ్గు, రెండు వారాల పాటు జ్వరం, బరువు తగ్గడం, నోటి నుంచి రక్తం కారడం వంటి జరిగితే తక్షణం వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరు నెలల పాటు మందులు వాడటం వల్ల వ్యాధిని నియంత్రించవచ్చని వివరించారు. నాగమునిరెడ్డి, శివశంకర్, విజయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలు ఆక్రమిస్తే చర్యలు

జమ్మలమడుగు: మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా రోడ్లపై దుకాణాలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం తాడిపత్రి రహదారిలోని మోరగుడి మూడు రోడ్ల నుంచి పెద్దపసుపల రోడ్డు వరకు ఉన్న అక్రమణలను అధికారులు తొలగించారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో కాలువల్లో నీరు ప్రవహించే విధంగా పూడికల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టామని కమిషనర్ తెలిపారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

కమలాపురం: పరిసరాల శుభ్రత ముఖ్యమని, రోడ్లను శుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ ప్రహ్లాద్ కోరారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం దుకాణాదారులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. టీ కప్పులు, చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయవద్దని, రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. శానిటరీ మేస్త్రీ శ్రీనువాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీని తరిమికొడదాం

పులివెందుల టౌన్ : హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని దాన్ని తరిమికొట్టాలని సీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వలి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనలో భాగంగా పట్టణంలోని స్థానిక రమణప్ప సత్రంబడి హైస్కూలులో కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష విడనాడాలని కోరారు. హెచ్ఐవీ అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు, సీడీఎస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధులకు అన్నదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలోని శ్రీవీర నారాయణమ్మ అంధుల ఆశ్రమంలో వేముల గ్రామానికి చెందిన నారు బోయిన ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు నారుబోయిన గంగాధర్ యాదవ్, నారుబోయిన ఆంజనేయులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వేముల మాజీ సర్పంచ్ నాగేశ్వరమ్మ, మస్తానయ్య, శామీర్, దివ్యాంగులు, అంధులు, తదితరులు పాల్గొన్నారు.

పందుల చోరీ

కొండాపురం: మండల కేంద్రంలోని కొండాపురంలోని శాంతి నగర్‌లో ఎరికల నాగన్నకు చెందిన పది పందులు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కొండాపురంలో పందులు దొంగలించారని నాగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

బహుమతుల ప్రదానం

లింగాల : లింగాల మండలం పెద్దకుదాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ బాల రామకృష్ణయ్య, ఇన్‌చార్జి హెచ్ఎం వాసుదేవారెడ్డిల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు సమాజంలో నైతిక విలువలు, మానవతా విలువలు- విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కొండారెడ్డి, ఎంఈఓ రామకృష్ణయ్య బహుమతులను అందజేశారు.

చవితికి సిద్ధమవుతున్న గణనాథుడు

- ఆధునిక డిజైన్లతో ఆకట్టుకునే విధంగా విగ్రహాల తయారీ
- 3 వేల నుంచి లక్ష రూపాయలు పలుకుతున్న ధర



విక్రయానికి సిద్ధంగా ఉన్న గణేష్ విగ్రహాలు

మైలవరం: బొజ్జగణపయ్య చవితి వేడుకలకు సిద్ధమవుతున్నాడు. పిల్లా–పెద్దా అందరూ కలిసి ఆనందంగా జరుపుకునే పండుగల్లో వినాయకచవితి ఒకటి. ఆ వినాయకుడి పూజకు ప్రధానంగా కావాల్సింది ప్రతిమలే. గృహాల్లో మట్టి గణపయ్యను పెట్టుకుని వ్రతాన్ని పూర్తి చేసుకున్నా మండపాలు కట్టి ఐదు లేక తొమ్మిది రోజుల పాటు పూజలు చేయాలనుకునేవారు ఖచ్చితంగా పెద్ద విగ్రహాల కొనుగోళ్లపైనే దృష్టిసారిస్తారు. ఈనెల 27న వినాయకచవితి పర్వదినం సందర్భంగా పూజలు అందుకునేందుకు గణనాథుల ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వాడవాడలా గణపతి నవరాత్రులు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు.

పలు ఆకృతుల్లో ప్రతిమలు

మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేయబోతున్న ఈ విగ్రహాలను తయారీదారులను తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఈ విగ్రహాల ధర మూడువేల నుంచి ప్రతిమ సైజును బట్టి లక్ష రూపాయల వరకు రేటు ఉంటుందని తయారీదారులు చెబుతున్నారు. జమ్మలమడుగు, మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాలలో ఈ విగ్రహాల తయారీ కోసం బయటి ప్రాంతాల నుంచి కార్మికులను తెచ్చుకుంటున్నారు. భక్తులను ఆకట్టుకునే విధంగా పలు రకాల ఆకృతుల్లో విగ్రహాలను రూపొందిస్తున్నారు. వీటికి రంగులు వేసి ఆకర్షణీయంగా సిద్ధం చేస్తున్నారు. 3 అడుగుల నుంచి 10 అడుగుల భారీ విగ్రహాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. గణేష్ ఉత్సవాలకు కొద్దిరోజులే సమయం ఉండటంతో విగ్రహాలను కొనుగోలు చేసేందుకు మండపాల నిర్వాహకులు క్యూ కడుతున్నారు. ఆకర్షణీయమైన విగ్రహాలను ముందస్తుగా బుక్ చేసుకుంటున్నారు.

120 విగ్రహాలు తయారు చేశాం



ప్రతి సంవత్సరం వంద విగ్రహాలు తయారు చేసేవాడిని. ఈ ఏడాది 120 ప్రతిమలు తయారుచేస్తున్నాం. ప్రస్తుతం మా వద్ద మూడువేల నుంచి 30 వేల రూపాయల విలువ చేసే బొమ్మలు ఉన్నాయి. వివిధ ఆకృతుల్లో విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. నా వద్ద ఉన్న బొమ్మల్లో 80 విగ్రహాలకు ఇప్పటి వరకు అడ్వాన్సు ఇచ్చి బుక్ చేసుకున్నారు. –గురుశేఖర్, విగ్రహ తయారీదారుడు, కన్నెలూరు

అధికంగా యూరియా వాడితే అనర్థమే



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వ్యవసాయాధికారులు

జమ్మలమడుగు: రైతులు యూరియా అధికంగా వాడకం వల్ల పంటలను చీడపురుగులు ఆశించే ప్రమాదం ఉందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం సహకారంతో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక మోతాదులో ఎరువుల వాడడం వలన కలిగే దుష్పలితాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంటలకు భూసార పరీక్షలు అనుసరించి ఎరువులు వాడుకోవాలని సూచించారు. జీవామృతం, ద్రవ జీవామృతం వాడడం వలన కాలుష్యాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు. జీవామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వలన విత్తన ద్వార వ్యాప్తి చెందే తెగుళ్ల నివారించవచ్చని సూచించారు. కాలానికి అనుగుణంగా వ్యవసాయ పద్ధతులను మార్చుకోవాలని, అప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అనంతరం కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయాధికారి సుచిత్ర, ఏఓ సుజన రైతులు పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత లక్ష్యాలు సాధ్యం



మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ గంగిరెడ్డి

చింతకొమ్మదిన్నె : విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ సదస్సును నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరేందుకు పట్టుదలతో చదవాలని సూచించారు. విద్యాసంస్థల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువ ఇంజనీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తమ కళాశాలలో క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన ఉన్నత విద్యను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు హితేంద్ర, రంజిత్ కుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవనోపాధికి పశుపోషణ చక్కని తోడ్పాటు



పాడి రైతులకు మందులు అందజేస్తున్న ఉప సంచాలకులు అమరనాథరెడ్డి

చింతకొమ్మదిన్నె : జీవనోపాధికి పశుపోషణ చక్కని తోడ్పాటునందిస్తుందని జూనియర్ వెటర్నరీ అధికారి కిషోర్ తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వారి ఆర్థిక సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం, రైతు అవగాహన సదస్సును చింతకొమ్మదిన్నె మండలంలోని పాపాసాహెబ్ పేట గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో 49 పశువులకు సాధారణ చికిత్స, 18 పశువులకు గర్భధారణ చికిత్స, 216 మేకలు గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించామని జూనియర్ వెటర్నరీ అధికారి కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ శారదమ్మ, పీడీ డాక్టర్ విజయలక్ష్మి, కడప ఏడీ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, చింతకొమ్మదిన్నె సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, పశువైద్యులు డాక్టర్ శిరీష, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట: పశువులకు లవణ మిశ్రమం తప్పనిసరిగా వాడాలని పశువైద్యశాఖ పులి వెందుల ఉప సంచాలకులు అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సురభి గ్రామం కుప్పగుట్టపల్లెలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వారి ఆర్థిక సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేగదూడలకు నట్టల నివారణ మందు ప్రతి నెలా తాపించి ఆరోగ్యాన్ని సంరక్షించాలని చెప్పారు. నట్టల నివారణ మందు తాపే ముందు పేడ పరీక్షలు నిర్వహించి తగిన మందులను మాత్రమే వాడాలని జిల్లా వ్యాధి నిర్ధారణ కేంద్ర సహాయ సంచాలకులు మాదవి సూచించారు. కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ పశు వైద్యుడు శివరామిరెడ్డి, వేంపల్లె పశుసంవర్ధకశాఖ ఏడీ రవీంద్రనాథరెడ్డి, రైతులు పాల్గొన్నారు

అదుపుతప్పిన వాహనాలు



డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు, లారీ

ముద్దనూరు: ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో గురువారం రెండు వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ముద్దనూరు వైపు నుంచి తాడిపత్రికి కారు, లారీ ముందు వెనుక ప్రయాణిస్తున్నాయి. వాహనాలు అధిగమించే ప్రయత్నంలో రెండు వాహనాలు అదుపుతప్పి రహదారి డివైడర్‌పైకి దూసుకెళ్లాయి. అయితే రెండు వాహనాల్లో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

దివ్యాంగుల పింఛన్లు తొలగించడం దారుణం

దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షుడు చాగలేటి భాస్కర్



పులివెందుల టౌన్ : అర్హులైన దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం తొలగించడం దారుణమని, దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల నియోజకవర్గ అధ్యక్షుడు చాగలేటి భాస్కర్ పేర్కొన్నారు. గురువారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి తీసుకున్న పింఛన్లకు కూడ రీ వెరిఫికేషన్ చేయాల్సిన అవసరం ఏ ముందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈనెల 10వ తేదీ నుంచి సచివాలయ పరిధిలో ఉన్న దివ్యాంగులందరికీ కొత్త సదరం సరిఫికెట్లు ఇచ్చారని ఇందులో రాష్ట్రవ్యాప్తంగా 1,08,000మంది పింఛన్లు తొలగించారన్నారు. అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా అర్హత కలిగిన ఎంతోమంది దివ్యాంగుల పింఛన్లు తొలగించడం తీవ్ర అన్యాయమన్నారు. అర్హులకు పింఛన్లు అందని పక్షంలో న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు.

సింహాద్రిపురం : కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయకపోగా, అర్హత ఉన్న దివ్యాంగుల పింఛన్లను అన్యాయంగా తొలగించారని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు ముల్లా బిలాల్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కాలంలో రూ.4.50లక్షల పింఛన్లను తొలగించడం జరిగిందని, 2024 ఎన్నికల ముందు నాటికి 66.34లక్షల పింఛన్లు ఉంటే.. 2025 ఆగస్టు నాటికి 62.19లక్షల పింఛన్లు మాత్రమే ఉన్నాయన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి

తొండూరు : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు సాధనకై చేపడుతున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని 2003 డీఎస్సీ టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ బండి నాగేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సంతకొవ్వూరు గ్రామంలో ఉన్న జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 25న విజయవాడలో నిర్వహించే మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ 2003 డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57లో జారీ చేయడం జరిగిందని, ఆ విధంగానే అన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం నూతన పెన్షన్ విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో అనుసరించి అర్హత కలిగిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ మహా ధర్నాలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

భూసార పరీక్షలతో లాభాల పంట



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె: భూమి సారవంతంగా ఉండడం వల్లే నాణ్యతతో కూడిన పంటలు, అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోరి రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం, సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలంలో మట్టిని రెండు లేదా మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పైరుకు కావలసిన అన్ని పోషకాలు సహజంగా నేలలో ఉంటాయని, కానీ ఇవి పైరుకు లభ్యం కావడమనేది నేల యొక్క భౌతిక, రసాయన, లక్షణాలు, సూక్ష్మజీవుల చర్యలపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. నేలలో ఉన్నటువంటి పోషకాలు ఎంతవరకు లభ్యమవుతున్నాయో వేయదలచిన పైరుకు అవసరమైన పోషకాలను భూసార పరీక్షల ద్వారా నిర్ధారించుకుని ఎరువులు వేస్తే పంటల్లో ఖర్చు తగ్గించి అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

లింగాల : మండల కేంద్రమైన లింగాల ఐటీఐ కళాశాలలో మూడవ విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. గురువారం ఆమె తెలుపుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు లింగాల ఐటీఐ కళాశాలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ చేయించుకోకపోతే పేర్లు నమోదు కావన్నారు. ఈనెల 29వ తేదీన లింగాల ఐటీఐ కళాశాలలో జరిగే అడ్మిషన్లకు విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

వేంపల్లె : వేంపల్లెలోని కందుల ఓబుళరెడ్డి ఐటీఐలో మిగిలిన సీట్లకు ఈనెల 26వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన తెలుపుతూ ఐటీఐ కళాశాలలో ఫిట్టర్, సివిల్, వెల్డర్, డీజిల్ మెకానిక్, ప్లంబర్ కోర్సులలో సీట్లు ఉన్నాయని, వెల్డర్, ప్లంబర్ కోర్సులలో చేరడానికి 10వతరగతి ఫెయిల్ అయిన వారు కూడా అర్హులన్నారు. డీజిల్ మెకానిక్, సివిల్ కోర్సుల్లో చేరే విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ ఎస్.సౌజన్య శుక్రవారం ఉదయం 11.45గంటల నుండి మధ్యాహ్నం 3గంటలవరకు సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు సలిపిరి, తల్లి (అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు(మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పెను కోరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రముఖ ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు డాక్టర్ దీప్తి బత్తు కాస్మెటిక్ సర్జరి, హ్యాండ్ సర్జరి, మైక్రో వ్యాక్యులర్ సర్జరి, ట్రామా రీకంస్ట్రక్షన్, బర్న్ సర్జరి, డయాబెటిక్ ఫూట్ సర్జరి, క్రానియో ఫేషియల్ సర్జరి, అన్యో రీకంస్ట్రటివ్ సర్జరి సేవలు అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీవరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం నిర్వహించనున్నట్లు ఎన్ఆర్ఐ, చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సీఈఓ కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యుల సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి శుక్లం గల వారికి మాత్రమే కంటి శుక్లం ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. కంటి ఆపరేషన్ కొరకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర వివరాలకు 8247705346, 8247637864, 9441131083 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

పులివెందుల రూరల్ : చిరుధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వైఎస్సార్ ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ నాగరాజు తెలిపారు. పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ ఉద్యానవన కళాశాలలో గురువారం కొలు రైతులకు ఉద్యాన తోటలలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మండల పరిధిలోని పలు గ్రామాలలో రైతుల ఎంపిక చేసి వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ రైతులకు మునగ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్ గోపాల్ హాజరై మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో ఎంపిక చేసిన రైతులకు ఏడాది పొడవునా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే రైతులకు జీవన ఎరువులు, చిరుధాన్యాలు అందజేస్తామన్నారు. హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎకరాకు సరిపడా మునగ మొక్కలను, విత్తనాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు వెంకటసుబ్బయ్య, రామాంజనేయరెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి, వినయ్‌రెడ్డి పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్



పులివెందుల రూరల్ : పులివెందుల డివిజన్ పరిధిలోని మండలాల్లో ఉన్న గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటు చేసుకునేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ సూచించారు. గురువారం పులివెందులలోని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా 3, 5, 9, 11 రోజులపాటు వినాయక చవితిని భక్తులు ఘనంగా జరుపుకోవాలన్నారు. వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా తమ మండలాల పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్లకు వెళ్లి పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కానీ, పట్టణంలో కానీ ఏవైనా సంఘటనలు జరిగినా, పెద్ద, పెద్ద సౌండ్లతో రికార్డు డ్యాన్సులు, ప్రొగ్రామ్స్ పెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పడుగను ఆహ్లాదకర వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

వేంపల్లె : ప్రశాంతంగా వినాయక చవితిని జరుపుకోవాలని తహసీల్దార్ హరినాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలోని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరినాథరెడ్డి మాట్లాడుతూ పండుగ సమయంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పీస్ కమిటీపై ఉందన్నారు. వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ముందస్తు అనుమతులు పొందాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక మండపాలను ఏర్పాటు చేయాలన్నారు. వినాయక చవితి పండుగ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సీఐ నరసింహులు మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, అనుమతి ఉంటేనే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు: ఎర్రగుంట్ల మండలం కలమల్ల పరిధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. కలమల్ల స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామ పంచాయతీల్లో ఎక్కడెక్కడ విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని, ఎప్పుడు ఎక్కడ నిమజ్జనం చేసే వివరాలు, మండపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలను పోలీసులకు నిర్వాహకులు తెలిపాలని సూచించారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

పులివెందుల టౌన్ : వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఇన్‌చార్జి సీఐ హాజీవలి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక చవితి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అలాగే వినాయక మండపాలు, వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

పెండ్లిమర్రి: వినాయక చవితిని ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రూరల్ సీఐ చల్లని దొర పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పని సరిగా పొందాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. నిమజ్జనం వద్దకు చిన్న పిల్లలను తీసుకెళ్లవద్దని సూచించారు.

ప్రజలందరూ శాంతి మార్గంలో నడవాలి

వేంపల్లె: ప్రజలందరూ శాంతి మార్గంలో నడవాలని సీఐ నరసింహులు పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని సీఐ నరసింహులు ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక శ్రీచైతన్య హైస్కూలు నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా సీఐ నరసింహులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత సామరస్యంతో మెలగాలని కోరారు. అన్ని మతాలను గౌరవించాలని సూచించారు. పండుగలనుప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు యోగేశ్వరబాబు, చల్లా బాలాజీ, రామమునిరెడ్డి, డాక్టర్ రంగయ్య, డాక్టర్ రాజారామ్, రంగారెడ్డి, చలపతి, గురుప్రసాద్‌ల తోపాటు మానవత సేవా సంస్థ సభ్యులు, శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కమలాపురం: అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు రాణి, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం దేశ వ్యాప్తంగా అఖిల భారత అంగన్వాడీ యూనియన్ బ్లాక్ డే నిర్వహించాలని నిర్ణయించడంతో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీడీపీఓ శ్రీలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలకు 2014 నుంచి వేతనాలు పెంచలేదన్నారు. 2019 నుంచి రాష్ట్ర ప్రభుత్వం సైతం వేతనాలు పెంచలేదన్నారు. ఈ కాలంలో పని భారం పెరిగింది గాని వేతనాల పెంపు ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారే గాని దాని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని కోరారు. సెంటర్ల నిర్వహణకు వచ్చిన ఫోన్లు, పోషణ్ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌లకు సపోర్ట్ చేయడం లేదని తెలిపారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సెక్టార్ నాయకురాళ్లు శివ కుమారి, అరుణ, యశోద, శైలజ, వాణి, వసంత, కుమారి పాల్గొన్నారు.

ముద్దనూరు: ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అంగన్వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు ప్రమీల, భవాని, ప్రభావతి, పద్మావతి, సుమ, సుబ్బలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రతినిధులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రాజెక్టు సీడీపీఓ కొండమ్మకు వినతిపత్రం అందించారు.

వేతన చట్టాన్ని అమలు చేయాలి

కొండాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు అంగన్‌వాడీ అసోసియేషన్ మండల అధ్యక్షురాలు కోరారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగాగా వేతనాలు పెంచుతామని చెప్పి ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.